# చిన్నాజీ

రోజు ముసిరింది. జల్లుజల్లుగా వానొచ్చి పోతూంది. కథ రాద్దామని సంకల్పించుకొని కలం కాగితాలూ తీశా. కథలో కల్పించబోయే మనుష్యు లప్పుడే సజీవంతో నాయెదట అల్లరి చేస్తున్నారు. వాళ్ళమధ్యని లడాయి పెట్టి పేలాపన పెంచీస్తే వాళ్ళంతకువాళ్ళు, ఆ సృష్టించిన మనుష్యులు, ఒక పర్యవసానాని కొస్తారు. కలం కాయితం మీద సరిగ్గా నడిస్తే గంటన్న రలో కథై పోతుంది.

కాని చిన్నాజీ వొచ్చింది 'వస్తాడే మా బావ' పాడుతూ.

చిన్నాజీ మనం పిలిస్తేరాదు. ఉన్నత కవిత్వానికిమల్లే దాని రాక పోకలకి 'మూడ్సు' ఉన్నాయి. దానంతకదే వచ్చి పదైదు నిముషాలు నెత్తెక్కి వెర్రిపీరులా పాకిపోతుంది.

అలా గొచ్చినప్పుడే నారాయణబాబు 'చిన్నా నీ కళ్ళు' (చిన్నాజీ కళ్ళు క్రైస్టుచైల్డు కళ్ళు) అని సంబోధన చేస్తూ ఆశువుగా గీతం రాసుకుంటాడు.

ఎంగిళ్ళై, ఏమూలై, మడివ్యవహారాలు పూర్తయి బామ్మ వంటిం ట్లోంచి ఇవతలపడితే చిన్నాజీ ఆమె పీక పట్టుకుని, నెత్తిమీద ముసుగు పీకేస్తూ, వెర్రి సరదాతో వొళ్ళు పూనంచేస్తూ, తాంబూలం చొంగ గుండెల మీదికి కార్చేస్తూ, బుగ్గలు కొరికేస్తే 'చచ్చేనే వెధంముండా' అంటూనే ఆ నొప్పిలోంచి సంతోషపడి పోతుంది వాళ్ళ బామ్మ.

ఉయ్యాల్లో పడుకుని చిన్నాజీ నిద్రపోతూ ఉంటే రాత్రివేళ ప్రత్యేకంగా పనికట్టుకొచ్చి దిష్టిపోడానికి ఇంద్రాక్షి వీభూతి పెడుతూ 'ఇత్తి' బామ్మగారు 'ఇవాళ చిన్నాజీ మా యింటికే రాలేదు' అని జాలిగా, విచారంగా అంటారు. చిన్నాజీ ఒక్కొక్కనాడు వాళ్ళ గుమ్మం తొక్కదు. ఒక్కొక్కనాడు కాఫీలూ, భోజనాలూ అన్నీ వాళ్ళింటే. ఒక్కొక్క

రాత్రి రాజు నాన్నా, పిన్నిదగ్గర పండుకుంటా నంటుంది. రాజు నాన్న కింకేం కావాలి? పందిరిమంచం మధ్యస్థంగా పడుకో పెట్టుకుంటాడు. అర్థరాత్రి అయిాసరికి చిన్నాజీ పరుపూ, దుప్పటీ కూడా తడిసి చలేసి లేస్తాయి. చిన్నాజీ పాలుతాగి 'ఇత్తి' బామ్మగారి ముసుగులోకి మళ్ళా ఉద్ధరించడానికి, దూరుతుంది. పరుపూ, తడిసి చలిబాధపడుతున్నా రాజునాన్నకి తొమ్మిదైపోయినా తెలివి రాదు. తెల్లారిం తరవాత యీ ఘనకార్యం మా యింట్లో పదిసార్లూ, వాళ్ళింట్లో పదిహేనుసార్లూ చెప్పు కుంటే ఉదయం కాలక్షేపమైపోతుంది. పక్కింటావిడ మధ్యాహ్నం కాఫీ గుండ బదులుకొస్తే, 'రాత్రి మా చిన్నాజీ ఏంచేసిందనుకున్నారు?' అని ఆవిడ కంతా 'ఇత్తి' బామ్మగారు చెపుతారు. పక్కింటావిడ వాళ్ళ కొడుకు చేసిన ఇంకో వీరకృత్యం చెప్పబోతారు. దాన్ని తిన్నగా వినేపించుకోరు 'ఇత్తి' బామ్మగారు. ఆవిడ వెళ్ళిపోయింతరవాత పైగా వెక్కిరిస్తారు. చిన్నాజీనిమాత్రం పక్కింటావిడ వెక్కిరించదూ? ఆ విషయం 'ఇత్తి' బామ్మగారి కక్కర్లేదు.

'నీ మువ్వల సవ్వడి వింటాడే' పాడుతోంది చిన్నాజీ.

మువ్వల మోతలని (మోతలనో) పాడుతుంది సినీమాలో మరదలు. అంతకన్నా 'మువ్వల మాటలు' అనడంలో కవిత్వం ఉందం టాడు నారాయణబాబు. భావకవి కాకపోయినా భావకుడు కదా విప్లవకవి నారాయణబాబు !

"ఏం చిన్నాజీ వొచ్చావూ?" అని పలకరించా.

"అఁ" అని తెగబారెడు సంగీతం తీసింది.

"మొహ మేం టలా గుంది!"

"నీళ్ళు పోసుకొని స్నో రాసుకున్నానూ" అంటూ రాగాలాపన చేసింది.

"తమ్ముడికి రాశావా"

"వాడి కెందుకూ స్నో?"

"అదేమండీ సార్?"

"వాడి ముక్కునిండా ఎప్పుడూ స్నో ఉంటుంది. వాడే రాసుకొంటూ ఉంటాడు" అమ్మాయి నవ్వుకొంటూ ఇంకో పాటలో పడ్డాది.

"తెనుగుతల్లి పూజకు
పూలో పూలో!"

చిన్నాజీకి పాటల "ఇచ్" ('itch') ఉన్నాది. ప్రెంచి పండితుడు అప్పలస్వామినాయుడు వొచ్చి రసగుల్లాలాంటి * 'రోఁసార్' కవి గేయంతో చరణం అందుకుంటాడు.

"Quand je vois dans un jardin
Au matin
S' eclore une fleur nouvelle
Je compare le bouton
Au teton
De son beau sein qui poumelle"

దాంతో వెర్రెత్తిపోతాడు గాయకుడు నారాయణబాబు. పరాసు పద్యం పరారీ అయీలాగ పాడతాడు ఇంగ్లీషుపాట నవ్య సాహిత్య పిపాసి నారాయణబాబు.

"Oh hush thee my baby
Thy cradle's in pawn
No blankets to cover : hee
Cold and forlorn
The stars in the bright sky
Look down and are glum
At the heir o' the ages
Asleep in a slum"

'రోఁసార్'ని వొదిలి అప్పుడు ఆంగ్లకవి అప్పలస్వామి నారాయణబాబు గొంతుకతో కలుపుతాడు యీనాటి 'నర్సరీరైమ్' (Nursery rhyme) గదుల చేతకూడ అరిపిస్తూ.

"Thy mother is crying
Thy dads's on the dole
Two shillings a week is

* Pierre de Ronsard

The price of a soul"

చిన్నాజీ పరిగెట్టుకొచ్చి ముద్దరాలై రెప్పవాల్చకండా చూస్తూ వింటుంది. పాటలు మానగానే తుర్రున పిచ్చికిలా గెగిరిపోతుంది.

"మల్లెమాలతీ సంపంగి" అని పాడుతోంది.

"పిచ్చి పాటలు పాడకు!" అన్నా.

"మంచిపాటలే ఇవి!"

"ఛీ! ఛీ!"

"ఇవి మంచిపాటలేంటమ్మా?" అని వెక్కిరిస్తూ పాడింది!

"మా అమ్మే చంపింది!
మా అమ్మే చంపింది!"

అది నారాయణబాబు గీతంలోది. చిన్నాజీకి అతని గీతాలు వెర్రి కేకలు, అతను వెర్రివేపకాయ! అప్పలస్వామి తాగుబోతు, ఉన్మాదుడు. చిన్నాజీ దృష్టిలో నే నెవ్వణ్ణో!

కథ రాద్దామని కూర్చున్నా. చిన్నాజీ వొచ్చింది, కథాగిపోయింది. కలం కాగితాని కెక్కిందికాదు.

ఇంట్లో ఏంగోలగా ఉన్నా కథ కవాంతరంరాదు. రాత్రిమడి కారేసుకొన్న పంచె ఎగిరి ఎంగిలాకుల్లో పడ్డాదని, రాత్రి తడిబట్టలో పిండిచేసుకోవాలికదా అని తల్లి గొడవ చేసుకొంటూ ఉంటే కథకి ప్రతి బంధకం కాదు.

కథమధ్యలో పెళ్ళాంవచ్చి, కాఫీ టేబిలుమీద పెట్టి "రాత్రికేం వొండను? వంకాయ లున్నాయి. మధ్యాన్నమదే కూరైంది. పాటోలీ, పులుసుపచ్చడీ చెయ్యనా?" అని రామాయణంలో పుడకల వేట్లాటలాగ రాత్రి తిండి ప్రస్తావనతెస్తే రెండు కసురుతాను. "పెసరొడియాలు, వంకాయి ఇగురు పచ్చడి చప్పగా పాలోసి" అని పురమాయిస్తా. పెళ్లాంకి (పెసరొడియాలతో ముద్దలు గొంతుక దిగక, చప్పగా ఇగురు పచ్చడి నోటికెళ్ళక) ఎక్కళ్ళేని కోపం వచ్చి, దగ్గరికిరాగానే ఎప్పుడూ కసురుతా ననీ, పెళ్ళాం అంటే అంతకిట్టకపోవడం, అసహ్యం ఎక్కడా చూడలే దనీ, ధుమధుమలాడుతూ యింట్లోకిపోయి, చీకటి పడిదాకా తపించుకు చస్తూ వుంటే మన ప్రశాంతికి భంగంరాదు. ఆవిడ ఇచ్చిన కాఫీ రెండేసి

గుక్కలేస్తూ నాలుగేసి వాక్యాలు రాస్తే కథ సాఫీగా నాలుగు నిముషాల్లో నడిచిపోతుంది.

కాని చిన్నాజీ వొస్తే కథక్కాళ్ళొస్తాయి. ఇంతవరకూ నాకు సన్నిహితులుగా, దగ్గరగావున్న కథలో వ్యక్తులు చిన్నాజీరాగానే నాకూ వాళ్ళకీ సంబంధాలన్నీ తెగిపోయి, అపరిచితులుకూడా అయిపోయి రోడ్డున పోయే బాటసార్లలాగై పోయేరు !

సమస్య వొచ్చింది. చిన్నాజీని మరపించి అవతలకి పంపి కథ రాసుకోడమా? కథ మాని దాంతో కుచ్చిటప్పాలూ, కులాసా కేకలూ వెయ్యడమా? చిన్నాజీ ఎప్పుడూ మనదగ్గరకురాదు. అది రావడానికి మన వేళావిశేషం బాగుండాలి. కళా కళలు కుదరాలి అప్పుడొస్తుంది. వెన్నెట్లో రేరాణివాసనలా, చిన్నాజీ. అంచేత కథకే స్వస్తి చెప్పాలి!

కథ కేముంది? కథ తలుచుకున్నప్పుడు తాత పెళ్ళిలాంటిది. మామూలుగా రాసే చిన్నకథలకీ, చిరినాటకాలకీ 'మూడ్సు' అవసరం లేదు. నేను శ్రీనాథుడంతటి కవీశ్వరుణ్ణని బడిపిల్లలకి నచ్చచెప్పబోతూ, శ్రీనాథుడు హరవిలాసము రాస్తే తాను శరభవిలాసము రాస్తున్నానని తను రాసిన పద్యాలు (క్లాసులో పాఠం మాటే మరిచి) చదివే తెలివి తక్కువ తెనుగు మేష్టరుగారినో, బ్రిడ్జిటేబిలుమీద జేబురుమాల్లో డబ్బంతా ఓడి పోయి ఇంటికొచ్చి పెళ్లాన్ని చితకతన్నే క్లబ్బు మెంబరు మహాశయుణ్ణో జ్ఞాపకానికి తెచ్చుకుంటే కథై పోతుంది.

అంతకన్నా తేలికమార్గం కూడా వుంది. బెర్నార్డుషా నియంతల్ని వెక్కిరిస్తూ, విమర్శిస్తూ, నవ్వు పుట్టిస్తూ రాసిన నాటకాన్ని తీసుకొని దాని వరవడిలో — ఆ దస్తూరీతో సరిగా రాయలేకపోయినా — దానికి దగ్గిరగా అనుసరించి రూళ్ళమధ్య కాపీచేసుకుపోతే నాటకమైపోతుంది ! కావలిస్తే విశ్వ సాహిత్యానికి నేనో నాటకం రాశానని విర్రవీగి విరగబడ వొచ్చు!

అంత చవగ్గా చిన్నాజీతో ఐదు నిముషాలు లభ్యమౌతాయా ?

కాని సూదిబెజ్జంలోంచి విశ్వాన్ని చూడగలిగే సూక్ష్మజ్ఞానేంద్రియంతో మానవలోకాన్నవలోకించి అనుభవాలనీ, ఆదర్శాలనీ, ఆత్మనీ, ప్రకృతినీ సమన్వయిస్తూ మహాకావ్యం సృష్టి చేస్తున్నప్పుడు అడ్డంగా

చిన్నాజీవొస్తే దాన్ని పొమ్మంటానా? ఉఁహుఁ. మహాకావ్యమే ఆగి పోవాలి!

ఏమంటే ఆరఖం కళాసృష్టి నిజంగా ప్రపంచానిక్కావాలా? కవిగారి అవకతవక వ్యవహారం పెళ్ళానికి అసహ్యం; పిల్లలకి నవ్వుతాలు; మిత్రులకి డబ్బా; తోటి రచయితలకి అసూయత! చదివేవాడు లేడు. ప్రచురించేవాడు లేడు. ప్రచురిస్తే కొనేవాడు లేడు. అర్థం చేసుకోగలిగిన వాడసలే లేడు!!

ప్రభాతాన్నుద్దేశించి కోడి కూస్తుంది. కాకులరుస్తాయి. వర్షాగమ నాన్ని సూచిస్తూ కోయిల పాడుతుంది. రేపు ఐదుగంటల ముప్పయ్యారు నిముషాలకి కోడి కూయకపోయినా కాకు లరవకపోయినా సూర్యోదయ మౌతుంది. నిబిడ నీరదాలంటూ వొస్తే కోయిల పాడకండానే వర్షిస్తుంది. విప్లవ బీజాలంటూ మనుషుల్లో ఉంటే కవులు వీరగేయాలు పాడాలా, వెర్రి కేకలెయ్యాలా? కోళ్ళూ, కోయిలలూ, కవులూ, కాకులూ లేకపోతే ప్రపంచం ఆగిపోదు.

ఎందుకూ యీ కవిత్వం? అల్లడం, ఆయాసపడిపోవడం? పిచ్చెత్తి పోడం? భవిష్యత్తులో శతాబ్దాలు గడచిన తరవాత కీర్తి వొస్తుంది కాబోలు? మనం చచ్చిపోతే పురపాలకసంఘం గుమస్తా మన పేరుతో చావుని మరణాల రిజిష్టర్లో నమోదుచేయడం బద్దకించి మరిస్తే కనిపెట్టే పై ఆఫీసరు లేడాయె!

చిన్నాజీకి ఐదోయేడు. చూస్తూ ఉంటే దినదిన ప్రవర్ధమానై పెద్దదై పోతుంది. పెళ్ళి, పిల్లలు, ఉందీ, లేదూ అందరికిలాగే సిద్ధమౌతాయి. అప్పుడుకూడా 'చిన్నాజీ' అనే పిలుస్తాము కాబోలు ! చీకూ చింతాలేని చిన్నాజీ చిరుత ప్రాయం మరికొన్ని దినాలు కావాలంటే గ్రహగమనమే ఆపాలి! రెండురోజులు గడిస్తే చిన్నాజీ అమృత ప్రాయంలో మధుర క్షణాలు మళ్ళా లభిస్తాయీ?

రాకరాక చిన్నాజీ వొచ్చింది. కథా వొద్దు. కావ్యం నొద్దు చిన్నాజీతో ఐదునిముషాలు షేక్స్పియరు కామిడీలో రసవంతమైన ఐదంకాల పాటి చెయ్యవూ?